అర్తమూరులో ఎరువుల వ్యాపారి
రూ.2.3కోట్ల మేర కుచ్చుటోపీ
7లో



సంక్రాంతికి వస్తున్నాం

పల్లెకు పండగొచ్చింది



రాజమహేంద్రవరం బస్ కాంప్లెక్స్‌లో బ్యాగులతో ప్రయాణికులు..

గోదావరి జిల్లాల ఆప్యాయత.. అనురాగాలు.. ప్రేమకు తిరుగులేదు.. కాలం మారినా అదే తీరు.. గోదావరి నీటిలోనే ఆ ప్రేమ ఇమిడి ఉందో ఏమిటో తెలియదు కానీ.. గత పది రోజులుగా ప్రతి ఇంట్లోనూ పండుగకు ఎప్పుడొస్తున్నారు.. ఎప్పుడొస్తున్నారు.. అనే మాటకు అలుపే లేదు.. అంత ఆప్యాయతగా పిలిస్తే ఎందుకురారు.. సంక్రాంతికి వస్తున్నాం.. అంటూ బంధువులు వచ్చేస్తున్నారు.. అటు హైదరాబాద్ ఇటు వైజాగ్ నుంచి దారులన్నీ గోదావరి జిల్లాల వైపే చూపిస్తున్నాయి.. రైళ్లు ఫుల్ అయిపోతున్నాయి.. బస్‌ల సంగతి సరే సరి.. విమానాలదీ అదే పరిస్థితి.. కార్లు.. ద్విచక్ర వాహనాలపై వచ్చే వారి సంఖ్య తక్కువేం లేదు.. రోడ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి.. గోదావరి జిల్లాల్లోని పల్లెబాట పడుతున్నాయి..

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి వచ్చిందంటే గోదావరి జిల్లాల్లో సందడే వేరు.. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కుటుంబాలతో పండుగకు వస్తారు.. పట్టణం నుంచి పల్లెబాట పడతారు.ఉమ్మడి జిల్లాల నుంచి లక్షలాదిమంది బెంగళూరు, పుణే, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే ఎక్కువ. శుక్రవారం పని ముగించుకుని శని, ఆదివారం సెలవు కావడంతో పండుగకు బయలుదేరిపోయారు. శనివారం అర్ధరాత్రి నుంచే గోదావరి జిల్లాల రోడ్లకు తాకిడి పెరిగింది. రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, మధురపూడి ఎయిర్‌పోర్ట్ కిటకిటలా డిపోతున్నాయి. ప్రయాణికుల సంఖ్య గతంకంటే పెరిగింది. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి కొద్దినెలల కిందట కేవలం 1300 మంది వరకూ రాకపోకలు సాగిస్తే.. ప్రస్తుతం రోజూ 2 వేలమంది రాకపోకలు సాగిస్తున్నారు. కొద్ది రోజుల కిందట 80 శాతం నుంచి 95 శాతం వరకూ ఆక్యుపెన్సీ ఉండగా ప్రస్తుతం ఫుల్ అయిపోతున్నాయి. ముంబై, ఢిల్లీ నుంచి వచ్చే వారి సంఖ్య పెరిగింది. ఇక ఆర్టీసీలో సాధారణ రోజుల్లో 25 వేలమంది వరకూ ప్రయాణిస్తుంటే ప్రస్తుతం 50 వేలమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. స్వగ్రామాలకు చేరుతున్న విద్యార్థులు, ప్రజలతో బస్టాండ్లు కిక్కిరిసిపోయాయి. కాకినాడ నగరంతోపాటు రాజమహేంద్రవరం, అమలాపురం, రాజోలు, జగ్గంపేట, ఏలేశ్వరం, రావులపాలెం బస్టాండ్లలో సందడి కనిపించింది. రైళ్లలో ప్రతి రోజూ వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటే.. ఆయా రైల్వే స్టేషన్లన్నీ ఊపిరాడనంతగా కిక్కిరిసిపోతున్నాయి. ప్రధానంగా రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వే స్టేషన్లకు సంక్రాంతి పండుగ ప్రయాణికుల తాకిడి విపరీతంగా ఉందని చెబుతున్నారు.

- దారులన్నీ ఇటువైపే
- ప్రధాన నగరాల నుంచి రాక
- తరలివస్తున్న బంధుగణం
- బస్‌లు..రైళ్లు..విమానాలు ఫుల్
- కళకళలాడుతున్న పల్లెలు
- సొంత వాహనాలే ఆధారం
- హైవేలపై ట్రాఫిక్‌జామ్‌లు
- గోదావరి జిల్లాల్లో సందడి



200 బస్‌లు ఫుల్..

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు ఆర్టీసీ బస్సులన్నీ ఫుల్ అయిపోయాయి. పండుగ ముందు, తర్వాత కూడా వందశాతం బుకింగ్ పూర్తయింది. శనివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు బస్సులేవీ ఖాళీ లేకపోవడంతో హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణీకుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. సంక్రాంతి ప్రయాణాలకు ఆర్టీసీ బస్సుల్లో సీటు దొరికే పరిస్థితి లేకుండాపోయింది. హైదరాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాలకు సంక్రాంతి పండుగ సందర్భంగా వచ్చే ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాకు సుమారు 200 బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే బస్సులన్నీ ఫుల్ అయిపోయాయి. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని మరిన్ని స్పెషల్స్ నడిపేందుకు ప్లాన్ చేస్తున్నారు. దీనిని బట్టి చూస్తే తిరుగు ప్రయాణం కూడా కష్టంగా ఉండబోతుంది. ఈనెల 16 నుంచి 19 వరకు సీటు దొరికే పరిస్థితి లేదు. తిరుగు ప్రయాణాలు చేసుకునే వారికి 20వ తేదీ నుంచి మాత్రమే సీట్లు అందుబాటులో ఉన్నాయి.

జాతీయ రహదారులు కిటకిట

కార్పొరేషన్(కాకినాడ)/నల్లజర్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని జాతీయ రహదారులపై సంక్రాంతి సందడి మొదలైంది. వరుస సెలవులు కావడంతో పట్టణాల నుంచి పల్లెలకు ప్రజలు పయనమయ్యారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు బయలుదేరిన వారితో శుక్ర, శనివారాలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రహదారులపై వాహనాల రద్దీ నెలకొంది. విశాఖపట్నం నుంచి విజయవాడ 16వ నెంబర్ జాతీయరహదారి, కత్తిపూడి నుంచి పామర్రు 216వ నెంబరు హైవేపై వాహనాల రద్దీ కనిపిస్తోంది. ఈ రద్దీ తిరుగు ప్రయాణికులతో ఈనెల 19వ తేదీ వరకు కొనసాగనుంది.

రద్దీ ఎక్కువగా ఉంటే.. స్కూల్ బస్‌లు తిప్పేయండి..



కార్పొరేషన్(కాకినాడ), జనవరి 11: పండుగ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు చేపట్టాలని డీజీపీ, ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఎస్పీలు, ఆర్టీసీ డీపీటీవో, డీటీసీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళుతున్న ప్రయాణికులకు సరిపడా బస్సు సౌకర్యాల్లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, అటువంటిచోట్ల తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్టీసీ బస్సులు సరిపోకపోతే ప్రైవేట్ కాలేజీ, స్కూల్ బస్సులను ఉపయోగించాలని సూచించారు.

- డీజీపీ, ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు

బరిలో కోడి



ఆత్రేయపురంలో సిద్ధమైన పందెం బరి

- జూద క్రీడల నిర్వహణకు జోరుగా ఏర్పాట్లు..
- కోడిపందాలు, గుండాట, పేకాటలకు సర్వంసిద్ధం
- 'షరా మామూళ్లగా'నే అధికార యంత్రాంగం
- ప్రధాన రహదారుల చెంతనే పందెం బరులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాల ముసుగులో జూద క్రీడల నిర్వహణకు జోరుగా సన్నాహాలు జరుగుతున్నాయి. సాక్షాత్తూ అధికార తెలుగుదేశం పార్టీ కూటమికి చెందిన ప్రజాప్రతినిధుల ప్రత్యక్ష ప్రమేయంతో కోనసీమ జిల్లాలో కోడి పందాలు, గుండాటలు, పేకాటలు వంటివి నిర్వహించడానికి ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే కోడి పందాలు నిర్వహిస్తున్నప్పటికీ పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహిస్తుంది. గతం కంటే భిన్నంగా జిల్లా వ్యాప్తంగా భారీగా పందెం బరుల ఏర్పాటుకు కూటమి నేతలతో పాటు వైసీపీ నేతలు కూడా ఎవరికి తగిన తీరిలో వారు బరుల ఏర్పాటులో రంగంలోకి దిగారు. సాక్షాత్తూ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, కలెక్టర్ మహేష్ కుమార్‌లు ఇచ్చిన ప్రకటనలు ప్రచారానికే పరిమితమయ్యాయనే రీతిలో పందాల నిర్వహణదారులు వారికి సవాళ్లు విసురుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో బరులు నిర్వహిస్తున్నారు. ఐ.పోలవరం మండలం మురమళ్ల, కాట్రేనికోన మండలం చెయ్యేరు, ముమ్మిడివరం మండలం కొత్తలంకలతో పాటు ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం, అమలాపురం మండలంలోని అనేక ప్రాంతాలతో పాటు రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట, రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో భారీగా పందెం బరులు ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. 216 జాతీయ రహదారిని ఆనుకుని బరులు ఏర్పాటవుతున్నాయి. మరోవైపు సంక్రాంతి సంబరాల పేరిట సెట్టింగులు వేసి ఆ ముసుగులోనే గుండాట, పేకాట, కోడి పందాలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడక్కడా తమ ఉనికిని చాటుకునేందుకు ఫ్లెక్సీలు పెట్టి ఫొటోలు తీయడం 'షరా మామూళ్ల'గానే మారింది. మరికొన్ని చోట్ల పోలీసు బందోబస్తు నడుమ బరులను ట్రాక్టర్లతో దున్నేస్తున్నట్టు చేస్తున్నప్పటికీ అవి మొక్కుబడిగానే జరుగుతున్నాయి. బరి ఒకచోట ఉంటే మరోచోట ట్రాక్టర్‌తో దున్నే పనులు చేయడం కనిపిస్తుంది. ఈ సారి మురమళ్లలో భారీ ఏర్పాట్ల నడుమ కోడిపందాలు నిర్వహించడానికి వీఐపీ బరిని సిద్ధం చేస్తున్నారు. కోడి పందాల బరుల వద్ద కొన్నిచోట్ల ఇప్పటికే బెల్టుషాపులు పబ్లిక్‌గా వెలిశాయి. నిబంధనకు విరుద్ధంగా బహిరంగ లిక్కర్ విక్రయాలు పందెం బరుల వద్ద చేయడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పోలీసు యంత్రాంగం కనుసన్నల్లోనే బరులు ఏర్పాటయ్యే విధంగా కూటమి నాయకులు, పోలీసులతో మంతనాలు జరుపుతున్నారు. కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులకు ఇష్టం లేకుండా బరులు వేస్తుంటే వాటిని పోలీసులు అడ్డుకునే విధంగా వ్యూహాలు రూపొందించారు. మొత్తం మీద జిల్లా వ్యాప్తంగా వందకుపైగా కీలక బరులు సోమవారం నుంచి ప్రారంభించడానికి సర్వం సిద్ధమైంది. అయితే ఇప్పటికే రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం కోడిపందాల బరులు ఏర్పాటు కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చినప్పటికీ అవి ఈ పండుగ సీజన్‌లో ఖచ్చితంగా అమలయ్యే అవకాశాలు లేనట్టు తెలుస్తుంది. పోలీసు యంత్రాంగం కూడా చేతులెత్తేయడంతో పబ్లిక్‌గా బరులు ప్రధాన రహదారుల చెంతనే ఏర్పాటవుతున్నాయి. వీటిని ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు సైతం ముందుకు వస్తుండడంతో అధికారులు చేతులెత్తేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



216 జాతీయ రహదారిని ఆనుకుని అమలాపురం సమీపంలో సిద్ధం చేస్తున్న పందెం బరి

పండుగకు రావాలనే.. కంగారొద్దు!

పండుగకు స్వగ్రామాలకు రావాలనే కంగారొద్దు..

జాగ్రత్తగా రండి.. లేదంటే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది.. వచ్చీరాని డ్రైవింగ్‌తో ఇంత రద్దీ సమయంలో దూర ప్రయాణం కష్టమే.. అందుకే ఆలోచించి నిర్ణయం తీసుకోండి.. లేదంటే ప్రమాదాలు జరగొచ్చు..పండుగ నేపథ్యంలో చాలా మంది బెంగళూరు, హైదరాబాద్, పుణె.. తదితర ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. ఇలా వచ్చే వారి కారులో తప్పనిసరిగా ఇద్దరు డ్రైవింగ్ వచ్చిన వారు ఉండాల్సిందే.. ఎందుకంటే ఒకరు నిద్రపోయినా మరొకరు డ్రైవింగ్ చేయొచ్చు. లేదా నిద్ర వస్తే రహదారి పక్కన కాసేపు నిలిపివేసి నిద్రపొండి. ఎంత ఆనందంగా వస్తున్నారో అంతే భద్రంగా తిరిగెళ్లాలి సుమా..!

ఒక్క క్షణంలో.. ఘోరం!

- అన్నవరం దైవదర్శనానికి వెళ్తూ ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు.. ముగ్గురి మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు
- కాకినాడ జిల్లా కత్తిపూడి జాతీయ రహదారిపై ఘటన

7



ప్రమాద దృశ్యం

ఎస్.యానాం సంక్రాంతి సంబరాలను జయప్రదం చేయాలి

ఉత్సవాల నిర్వాహక కమిటీ



ఉత్సవాల వివరాలను వెల్లడిస్తున్న నిర్వాహక కమిటీ

ఉప్పలగుప్తం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్.యానాం బీచ్‌లో ఈ నెల 13,14,15 తేదీల్లో ఏర్పాటు చేసిన సంక్రాంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహక కమిటీ విజ్ఞప్తి చేసింది. బీచ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మూడు రోజుల కార్యక్రమాల షెడ్యూల్‌ను కమిటీ సభ్యులు వివరించారు. సంక్రాంతి వినోదాలను పంచేలా ప్రముఖ సినీ, మిమిక్రీ, మ్యాజిక్, మ్యూజిక్, జబర్దస్త్ హాస్య కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. దీంతో పాటు సంక్రాంతి సంప్రదాయ ఆటలను సైతం ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసులతో భద్రత కల్పిస్తామన్నారు. వేల సంఖ్యలో ప్రేక్షకులు కార్యక్రమాలను వీక్షించేలా వసతి కల్పిస్తున్నామన్నారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పర్యవేక్షణలో జరిగే ఉత్సవాలకు ఎంపీ హరీష్‌మాధుర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నట్టు తెలిపారు. సమావేశంలో దంగేటి చిట్టిబాబు, ఇసుకపట్ల రఘుబాబు, పలచోళ్ల పద్మనాభం, లంకే భీమరాజు, నత్తి చిన్నా, జోగి రాజా, అయితాబత్తుల రాజశేఖర్, పలచోళ్ల బుజ్జి, పినిశెట్టి నరసింహారావు, అయితాబత్తుల అజయ్‌సింగ్, మన్నె వెంకటేశ్వరరావు, ఉలిశెట్టి దొరబాబు, చీకట్ల శ్రీను, రేవు తిరుపతిరావు, కాండ్రేగుల ఏడుకొండలు, లంకే రాంబాబు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

అమలాపురం టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి తొలి రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీలను రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ రోలర్ స్కేటింగ్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు కేవీఎస్ మూర్తి, కార్యదర్శి ఎస్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సుమారు 250 మంది స్కేటింగ్ క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. ఆదివారం పోటీలు ముగింపు అనంతరం బహుమతి ప్రదానోత్సవ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మెట్రోకెమ్ అధినేత నందెపు బాలాజీ, టీడీపీ నాయకుడు గంధం పల్లంరాజు, బలసాడి బుజ్జి పాల్గొన్నారు.



హాజరైన క్రీడాకారులు

ప్రభల తీర్థాలలో అల్లర్లకు పాల్పడితే కఠినచర్యలు: డీఎస్పీ

అంబాజీపేట, జనవరి11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కనుమ రోజు నిర్వహించే ప్రభల తీర్థాలలో అల్లర్లకు పాల్పడితే కఠినమైన సెక్షన్లతో కేసులు నమోదు చేస్తామని కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు హెచ్చరించారు. ప్రభల తీర్థం సందర్భంగా స్థానిక పెద్దవీధిలోని కోప్పా మర్చంట్స్ భవనంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సీఐ రుద్రరాజు భీమరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రభల తీర్థం జరిగే జగ్గన్నతోటలో ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవానికి భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఉత్సవ కమిటీ సభ్యులు తీర్థం ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు. తీర్థం జరిగే ప్రాంతాలలో బెల్ట్ షాపులను ఏర్పాటు చేస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. జగ్గన్నతోటలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడు తున్నామని చెప్పారు. ప్రభల తీర్థానికి సంబంధించి వీడియో చిత్రీకరణ చేయించాలని ఆయా ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. తహశీల్దారు జె.వెంకటేశ్వరి, ఎస్ఐ కె.చిరంజీవి, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత



కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

కేరళ అందాలు సొంతం చేసుకున్న కోనసీమ

పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్

ఆత్రేయపురంలో సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు

ఉత్కంఠ భరితంగా ఈత పోటీలు

ఆత్రేయపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కేరళ అందాలను సొంతం చేసుకున్న కోనసీమ ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం ఆత్రేయపురం కాలువ రేవు వద్ద ప్రధాన కాలువలో 3రోజుల పాటు జరిగే సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు శనివా రం ప్రారంభించారు. తొలుతగా ఎంపీ గంటి హరీష్‌మాధుర్ జెండా ఊపి స్విమ్మింగ్ పోటీలు ప్రారంభించగా జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ జ్యోతి ప్రజల్వన చేసి పోటీలను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పావురాలను ఎగురవేసి ట్రోఫీ ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం స్విమ్మింగ్ పోటీలు ఆసక్తిగా తిలకించారు. ఆత్రేయపురం రోడ్డు నుంచి అధిక సంఖ్యలో మహిళలు రంగవల్లులు తీర్చిదిద్దారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన పలువురు స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మంత్రి దుర్గేష్ మాట్లాడు తూ సంక్రాంతి సంబరాల నిర్వహణకు ఎంతగానో కృషి చేసిన ఎమ్మెల్యే బండారుతో పాటు వివిధ శాఖల అధికారులను ప్రశంసించారు. గడిచిన ఐదేళ్లలో పర్యాటక రంగం అభివృద్ధి జరగలేదని, కూటమి ప్రభుత్వం పర్యాటకానికి పెద్దపీట వేస్తుందన్నారు. కోనసీమ ప్రాంతాన్ని పర్యాటకులు ఆకర్షించేలా సీఎం చంద్రబాబు టెంపుల్ టూరిజం, ఈకో టూరిజం, అడ్వంచర్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం తీసుకువచ్చినట్టు తెలిపారు. ఎక్కడిక్కడ రిసార్ట్స్ నిర్మించాల్సి ఉందన్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం సంక్రాంతిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఎంతగానో ఉల్లాసాన్ని అందించడం గర్వకారణమన్నారు. ప్రభుత్వం ఈ ట్రోఫీలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ లొల్ల లాకులు, పిచ్చికలంకలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. ప్రతి ఏటా ట్రోఫీ పోటీలు నిర్వహిస్తామన్నారు. గోదావరి ట్రోఫీ పోటీల్లో భాగంగా నిర్వహించిన ఈత పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. పోటీల్లో విజేతలకు మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బండారు బహుమతులు ప్రదానం చేశారు. అమెరికా నుంచి సంక్రాంతి పండుగకు స్వదేశానికి వచ్చిన 70 ఏళ్ల పైబడిన వృద్ధురాలు స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనడం విశేషం. సీఐ శివగణేష్ స్విమ్మింగ్ పోటీల్లో మొదటిస్థానం సాధించారు. వివిధ విభాగాల్లో స్విమ్మింగ్, రంగవల్లులు, పతంగి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకర్, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి, చిలువూరి సతీష్‌రాజు, కరుటూరి నరసింహరావు, ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, ముత్యాల బాబ్జి, కంఠంశెట్టి శ్రీనివాస్, గుత్తుల రాంబాబు, జల్లి కామేశ్వరరావు, నరాలశెట్టి వెంకన్న, జుజ్జవరపు హరిబాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.


ఈత పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మంత్రి దుర్గేష్


ఈత పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్య సాధనకు కష్టపడండి

సినీ హీరో కిరణ్ అబ్బవరం



మాట్లాడుతున్న కిరణ్ అబ్బవరం

గండేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మీ గోల్ నిర్ణయించుకోండి దాని కోసమే కష్టపడండి... ఆలోచించండి.. ఎవరు ఏమన్నా పట్టించుకోకుండా రీచ్ అవ్వండి అని సినీ నటుడు కిరణ్ అబ్బవరం పేర్కొన్నారు. గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో నిర్వహిస్తున్న కలర్స్ ఫెస్ట్ యువజనోత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. దీంతో విద్యార్థులు ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. కిరణ్ మాట్లాడుతూ నేను హీరో అవుతానంటే అందరూ నవ్వారు అది పట్టించుకోకుండా ప్రయత్నం చేశాను ఇప్పుడు హీరోగా మీ ముందు ఉన్నాను. పాజిటివ్‌గా ఆలోచించాలని కోరారు. కిరణ్‌ను ఆదిత్య యాజమాన్యం శేషారెడ్డి, సతీష్‌రెడ్డి ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కూడా పాల్గొన్నారు.



కిరణ్‌ను సత్కరిస్తున్న ఆదిత్య యాజమాన్యం

జాబ్ మేళాలో 187మందికి ఉద్యోగాలు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో జరిగిన జాబ్ మేళాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలకు చెందిన ప్రభుత్వ, ప్రయివేట్ ఐటీఐ విద్యార్థులు 187 మంది ప్రముఖ కంపెనీ అమరరాజ గ్రూప్ కంపెనీస్‌లో ఉద్యోగాలు పొందినట్టు కోనసీమ జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ ఎంవిజి.వర్మ తెలిపారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం


వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాల బోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా రూ.28,76,811 ఆదాయం లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. క్యూలలో వేచి ఉన్న పిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం రాత్రి సత్యశ్రావణి నృత్యనికేతన్ వారిచే అందించిన ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

రూ.28.76లక్షలు ఆదాయం

శృంగారవల్లభస్వామి ఆలయంలో....

పెద్దాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి వారిని భక్తులు శనివారం దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.82,960, అన్నదాన విరాళాలు రూ.59,975, కేశఖండన ద్వారా రూ.2,320, తు లాభారం, కానుకలు ద్వారా రూ.400, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.15,975 వెరసి రూ.1,61,556 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

నీతి అయోగ్ సదస్సులో 'శాన్ మెరైన్' ప్రాతినిధ్యం

కాకినాడ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఎకానమిక్ రీజియన్ ఆధ్వర్యంలో ఈ నెల 10,11 తేదీల్లో విశాఖలో 2 రోజుల పాటు నిర్వహించిన నీతి అయోగ్-2025 సదస్సులో కాకినాడకు చెందిన శాన్ మెరైన్ సంస్థ ప్రాతినిధ్యం వహించింది. ఈ వివరాలను సంస్థ తరఫున శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించారు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా విశాఖపట్నం ఎకానమిక్ రీజియన్, నీతి అయోగ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో ఆదానీ, హిందూస్థాన్ షిప్ యార్డ్ వంటి సంస్థలతో కలిసి శాన్ మెరైన్ సంస్థ పాల్గొంది. నౌకా నిర్మాణాన్ని ఆంధ్రప్రదేశలో అభివృద్ధి చేయడానికి శాన్ మెరైన్ సంస్థ చేసిన సూచనలను నీతి అయోగ్ స్వీకరించింది. షిప్ బిల్డింగ్ రంగాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఆదాయ వనరుగా మార్చడానికి భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. సదస్సులో విశాఖపట్నం, కాకినాడ, అనకాపల్లి, శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి తదితర 8 జిల్లాలను కలిపి విశాఖపట్నం ఎకానమిక్ రీజియన్‌గా ప్రతిపాదించారు. ఈ సందర్భంగా శాన్ మెరైన్ సంస్థ అధినేత షేక్ అలీషా మాట్లాడుతూ నీతి అయోగ్ సదస్సులో తాము చేసిన సూచనలు స్వీకరించడం చాలాసంతోషంగా ఉందన్నారు.

హైందవ సంస్కృతిని కాపాడాలి


పిఠాపురంలో హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ మహాసభలో ప్రమాణం చేస్తున్న ప్రతినిధులు

పిఠాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): హైందవ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పలువురు వక్తలు అన్నారు. పిఠాపురంలోని అగ్రహారంలో అనఘా దత్త క్షేత్రంలో హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ పంచమ మహాసభ శనివారం జరిగింది. మైసూరుకు చెందిన వేదపండితుడు కర్రి సంతోష్‌కుమార్ ఘనాపాఠి, హిందూ ధర్మా రక్ష సమితి అధ్యక్షుడు చెదులూరి గవరయ్య, సీనియర్ న్యాయవాది వడ్రాల చంద్రశేఖర్, ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు దేగల మహేష్, పెండెం శ్రీదేవి మాట్లాడారు. తెలుగురాష్ట్రాలు, తమిళనాడు, కర్నాటక, యానాం తదితర రాష్ట్రాల ప్రతినిధులు సభకు హాజరయ్యారు.

సేవ్ కల్చర్



రంగంపేటలో సేవ్ కల్చర్ అనే నినాదంతో దేవిన సిస్టర్స్ రూపొందించిన సైకతశిల్పం

ఆకట్టుకున్న దేవిన సిస్టర్స్ సైకతశిల్పం

రంగంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం, సంక్రాంతిని పురస్కరించుకుని సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని (సేవ్ కల్చర్) అనే నినాదంతో తూర్పుగోదావరి జిల్లా రంగంపేటలో ప్రముఖ సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు దేవిన సోహిత, దేవిన ధన్యత శనివారం సైకతశిల్పం రూపొందించారు. 14 అడుగుల వెడల్పు, 6 అడుగుల ఎత్తు కలిగిన ఈ సైకత శిల్పాన్ని ఇద్దరూ 8 గంటలు శ్రమించి తీర్చిదిద్దారు. ఈ శిల్పంలో ఒక వైపు స్వామి వివేకానంద, మరో వైపు సంక్రాంతి వాతావరణాన్ని చూపించారు. ఈ సందర్భంగా దేవిన సిస్టర్స్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

ఒక్క క్షణంలో.. ఘోరం!


శంఖవరం మండలం కత్తిపూడిలో జరిగిన ప్రమాదంలో చెల్లాచెదురుగా పడిఉన్న మృతదేహాలు

- అన్నవరం దైవదర్శనానికి వెళ్తూ ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు.. రెండు కుటుంబాల్లో విషాదం
- ఉదయం 7గంటల సమయంలో ప్రమాదం
- ముగ్గురి మృతి.. మరో నలుగురికి తీవ్రగాయాలు
- కాకినాడ జిల్లా కత్తిపూడి జాతీయ రహదారిపై ఘటన
- మృతులు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వాసులు

శంఖవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మరొక పది కిలోమీటర్లు పయనిస్తే ఆ కుటుంబం సత్యదేవుని సన్నిధిలో సంతోషంగా ఉండేది. వారింట సంక్రాంతి సందడి మిగిలేది. దూరం నుంచి వస్తూ గమ్యానికి దగ్గరలోకి వచ్చినా మృత్యు ఒడిలోకి చేరడంతో వారికి విషాదమే మిగిలింది. కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలో 16వ నెంబరు జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని కారు వెనుక నుంచి ఢీకొంది. అన్నవరం దైవదర్శనానికి వెళ్తుండగా జరిగిన ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

తెల్లవారుజామునే బయలుదేరి..

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం టౌన్‌కి చెందిన చవ్వాకుల శ్యాంప్రసాద్, అతని బావమరిది కరింశెట్టి శివన్నారాయణ, కరింశెట్టి శివన్నారాయణ భార్య దివ్య, కరింశెట్టి సత్యనాగమధు, శ్యాంప్రసాద్ భార్య చవ్వాకుల ప్రసన్న, తల్లి అమ్మాజీ, కారు డ్రైవర్ నిమ్మగడ్డ ధనుష్ కలిసి శనివారం తెల్లవారుజామున అన్నవరం రావడానికి ఉదయం 4-5 గంటల మధ్యలో కారులో బయలుదేరారు. వీరి వాహనం ఉదయం 7 గంటల సమయంలో అన్నవరానికి దగ్గర్లోనే పది కిలోమీటర్ల ముందు కత్తిపూడి వద్దకు చేరుకుంది. అక్కడ ఆగిఉన్న లారీని వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో చవ్వాకుల శ్యాంప్రసాద్(50), కరింశెట్టి శివన్నారాయణ (38), కరింశెట్టి దివ్య(30) అక్కడికక్కడే మృతి చెందగా మిగిలినవారు తీవ్రంగా గాయపడ్డారు. శ్యాంప్రసాద్ భార్య ప్రసన్న, తల్లి అమ్మాజీ అపస్మారక స్థితిలో వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ ధనుష్ మాత్రం స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదం జరిగిన తీరు చాలా ఘోరంగా ఉంది. వీరు ప్రయాణించే ఎర్టిగా కారు నుజ్జునుజ్జవడంతోపాటు రహదారులన్నీ రక్తమోడి చూపరులు చలించిపోయారు. ఈ ప్రమాదానికి స్పష్టమైన కారణం తెలియనప్పటికీ నిద్రమత్తుగానీ, లారీని గమనించకపోవడంగానీ అయి ఉండొచ్చని భావిస్తున్నారు.

క్షతగాత్రులను స్థానికుల సహాయంతో తుని, ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రులకు తీసుకెళ్లారు. ప్రత్తిపాడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కరీంశెట్టి శివనారాయణ మృతి చెందగా అమ్మాజీ, సత్యనాగమధులను మెరుగైన వైద్యంకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగిన లారీయే కారణం

జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలను ఢీకొట్టడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఆగి ఉన్న లారీలపై పోలీసులు చర్యలు చేపట్టకపోవడంతో ఇష్టానుసారంగా లారీలను నిలిపివేస్తున్నారు. దీంతో ఏటా పదుల సంఖ్యలో మృత్యువాత పడడంతోపాటు వందల సంఖ్యలో క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు.

భీమవరంలో విషాదఛాయలు

భీమవరం క్రైం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చవ్వాకుల శ్యాంప్రసాద్ మృతితో భీమవరంలోని ఆయన నివాసం వద్ద విషాదఛాయలు అలముకున్నాయి. అతడు భీమవరం గన్నాబత్తుల వారివీధిలో ఉంటున్నాడు. ఆయనకు సంతానం లేరు. యనమదుర్రులో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతని బావమరిది అయిన కరింశెట్టి శివన్నారాయణ కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలానికి చెందినవాడు. ఆయన కూడా ప్రస్తుతం భీమవరంలోనే ఉంటున్నారు. అతనికి కూడా సంతానం లేనట్లుగానే బంధువులు తెలిపారు.


చవ్వాకుల శ్యాంప్రసాద్ (ఫైల్‌ఫొటో)


భీమవరంలో విచారం వ్యక్తం చేస్తున్న శ్యాంప్రసాద్ బంధువులు

మధ్యాహ్నానికి వచ్చేస్తానని వెళ్లి..

అన్నవరం దేవాలయానికి వెళ్లి దర్శన అనంతరం మధ్యాహ్నానికి ఇంటికి వచ్చేస్తామని వారి కుటుంబసభ్యులకు ముందురోజే శ్యాంప్రసాద్ చెప్పాడు. ఇప్పుడు ఆయనతోపాటు చెల్లి, బావ కూడా ముగ్గురు మృతి చెందడంతో వీరి కుటుంబీకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. శ్యాంప్రసాద్‌కు అన్నదమ్ములు ముగ్గురుకాగా, పెద్దవారైన మోహన్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. రెండో సోదరుడు తాతాజీ 20ఏళ్ల క్రితం కృష్ణా పుష్కరాల్లో గల్లంతు కావడంతో అప్పటినుంచి తల్లి బెంగతోనే ఉన్నారు. మూడో సోదరుడు శ్యాంప్రసాద్ అందరినీ చూసుకుంటున్నాడు. దీంతో ఆఇంట విషాదం అలుముకుంది.

స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తి అరెస్టు


కేసు వివరాలు తెలుపుతున్న సీఐ దొరరాజు

కె.గంగవరం,జనవరి 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలోని కె.గంగవరం మండలంలోని కూళ్ల గ్రామంలో సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు చేధించారు. దీనికి సంబంధించి మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, పామర్రు ఎస్‌ఐ జానీబాషా విలేకరులకు వివరాలు తెలిపారు. సువర్ణరత్నం, మంచాల సూర్యచంద్రరావు స్నేహితులు. సువర్ణరత్నం తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే కోపంతో సూర్యచంద్రరావు సువర్ణరత్నం అలియాస్ శివను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. సూర్యచంద్రరావును కూళ్ల ఏటిగట్టుమీద అరెస్టు చేశామని, రామచంద్రపురం కోర్టుకు పంపించినట్లు వారు చెప్పారు.

భార్య బుగ్గను కొరికిన భర్త అరెస్టు

గొల్లప్రోలు రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ముక్కు ఊడేలా భార్య బుగ్గను కొరికి పైశాచికత్వం ప్రదర్శించిన భర్తను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన దాసం నాగబాబు తన భార్యను పిల్లలు పుట్టలేదనే నెపంతో మానసికంగా, శారీరకంగా హింసిస్తూ ఉండేవాడు. వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో నాగబాబు తన భార్య శేషారత్నం మెడను కొరికి చంపాలని ప్రయత్నించాడు. సాధ్యం కాకపోవడంతో బుగ్గను మాంసం ముద్ద వచ్చేలా కొరికి దాన్ని పళ్లతో పెరికివేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నాగబాబును శనివారం తాటిపర్తిలో అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

20 ప్రైవేటు ట్రావెల్ బస్సులపై కేసులు



ప్రైవేటు ట్రావెల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీవో

రావులపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి రావులపాలెం వైపు వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులను తనిఖీ చేసి 20 ట్రావెల్ బస్సులపై కేసు నమోదు చేసినట్టు జిల్లా రవాణా శాఖాధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. రావులపాలెం మండలం ఈతకోట జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఆయన స్థానిక అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రయాణికుల వద్ద నుంచి అధిక చార్జీలు వసూలు చేయడం, భద్రతా నియమాలు పాటించకపోవడంతో 20 బస్సులపై కేసు నమోదు చేసి రూ.74,500 అపరాధ రుసుము విధించినట్టు తెలిపారు. ఈ తనిఖీలు జనవరి 20వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

ధర్మవరంలో కోలాహలంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పందాలు

- సీనియర్స్‌లో గుమ్మిలేరు, జూనియర్స్‌లో ధర్మవరం ఎడ్ల జతలకు ప్రథమ బహుమతులు




ధర్మవరం- పోలవరం కాలువ గట్టులో పరుగులు పెడుతున్న ఎడ్లు

ప్రత్తిపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో గౌరీశంకర్ల 88వ వార్షికోత్సవం మహోత్సవాలు, సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని రాష్ట్రస్థాయి ఎడ్ల పందాలు శనివారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఈ పోటీలను ప్రారంభించారు. సీనియర్స్ విభాగంలో కోనసీమ జిల్లాగుమ్మిలేరు, జూనియర్స్ విభాగాల్లో కాకినాడ జిల్లా ధర్మవరం ఎడ్ల జతల కు బహుమతులు కైవసం చేసుకున్నాయి. ధర్మవరం పోలవరం కాలువ గట్టుపై ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలకు విశాఖ, అనకాపల్లి, కాకినాడ, ఉభయగోదావరి, కృష్ణ జిల్లాలకు చెందిన 36 ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నాయి. సీనియర్స్ విభాగంలో కోనసీమ జిల్లా గుమ్మిలేరు గ్రామానికి చెందిన కోరా తేజ ఎడ్ల జతకు ప్రథమ బహుమతి, కాకినాడ జిల్లా గొల్లప్రోలు కు చెందిన నిమ్మకాయల నూకరాజు ఎడ్ల జత కు ద్వితీయ బహుమతి, కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన తేజచౌదరికి చెందిన ఎడ్ల జత కు తృతీయ బహుముతి సాధించాయి. జూనియర్స్ విభాగంలో కాకినాడ జిల్లా ధర్మవరానికి చెందిన జువ్వల సత్తిబాబు ఎడ్ల జతకు ప్రథమ బహుమతి, తూర్పుగోదావరి జిల్లా కాపవరానికి చెందిన కుంచం మనోజ్ ఎడ్ల జతకు ద్వితీయ బహుమతి, తూర్పుగోదావరి జిల్లా వడిశలేరుకు చెందిన పైడిశెట్టి రిథం వీర కృష్ణశ్రీ ఎడ్ల జతకు తృతీయ బహుమతి లభించాయి. ఈ పోటీల్లో ప్రథమ బహుమతికి రూ.15వేలు, ద్వితీయ బహుమతికి రూ.12వేలు, తృతీయ బహుమతికి రూ.8వేలు, షీల్డ్‌లను విజేతలకు అందించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా యనమల కృష్ణ, నానాజీ, ఫణి వ్యవహరించారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పందాలు పురస్కరించుకుని ధర్మవరం పోలవరం గట్ల ప్రదేశాలు శనివారం జనసంద్రంగా మారాయి. ధర్మవరం రామభద్రరావు చెరువు పరిసరాల్లో ముందురోజే చేరుకున్న ఎడ్ల జతకు నిర్వాహకులు టెంట్లు, షామియానాలతో శిబిరాలు ఏర్పాటు చేసి భోజన వసతి సౌకర్యాలు కల్పించారు. పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ సంప్రదాయ క్రీడలు కనుమరుగవుతున్న నేటి ఆధునిక కాలంలో సంప్రదాయ క్రీడలను ప్రోత్సహిస్తున్న కమిటీని అభినందించారు. ఎన్డీయే కూటమి శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

- పలు రాష్ట్రాలనుంచి క్రీడాకారుల రాక
- తూర్పుగోదావరి జిల్లా వేళ్లచింతలగూడెంలో నిర్వహణ


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): యువత విద్యతోపాటు క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం వేళ్లచింతలగూడెంలో ఆర్‌అండ్‌ఎం ఫౌండేషన్ చైర్మన్ గంటా మధుకృష్ణ, ఎమ్మెల్యే మద్దిపాటి ఆధ్వర్యంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలను శనివారం రాత్రి ప్రారంభించారు. పలు రాష్ట్రాలనుంచి వచ్చిన క్రీడాకారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్య మిస్తోందన్నారు. మూడురోజులపాటు జరిగే ఈ పోటీల్లో 9 పురుషుల జట్లు, 10 మహిళా జట్లు పోటీల్లో పాల్గొంటాయన్నారు. పురుషులకు సంబంధించి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ పట్నం, తూర్పుగోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, పశ్చిమ గోదావరి జిల్లాల జట్లు, మహిళలకు సంబంధించి ఇండియన్ రైల్వే బ్లూఏ, ఇండియన్ రైల్వే ఆరెంజ్-బీ, ఆంధ్రప్రదేశ్-ఏ, తెలంగాణ-ఏ, ఉత్తరప్రదేశ్, ఢిల్లీబీ, చైనీస్, చత్తీస్‌ఘడ్-ఏ, హరియాణా-బీ, కర్ణాటక రాష్ట్రాలకు జట్లు పాల్గొంటాయన్నారు. శనివారం పురుషుల విభాగం నుంచి నెల్లూరు, ప్రకాశం జట్లు బరిలో దిగినట్టు ఎమ్మెల్యే మద్దిపాటి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌ఎం ఫౌండేషన్ చైర్మన్ గంటా మధుకృష్ణ, సీఐ నాగేశ్వర్‌నాయక్, ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్, సంక్రాంతి సంబరాల కమిటీ సభ్యులు, కొర్లపాటి శ్రీరామచంద్రమూర్తి(రాము), పిన్నమనేని చినబాబు, స్పోర్ట్స్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలో గుప్పుమన్న గంజాయి

- నిడదవోలులో 22 కిలోల స్వాధీనం
- 11 మంది యువకుల అరెస్టు


గంజాయి ముఠా వివరాలు వెల్లడిస్తున్న సీఐ తిలక్

నిడదవోలు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నిడదవోలులో రూ.1.10లక్షల విలువైన 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 11మంది యువకులను అరెస్ట్ చేసినట్టు సీఐ పీవీజీ తిలక్ అన్నారు. పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిడదవోలు పట్టణ శివారు తీరుగూడెం ప్రాంతంలోని టిడ్కో ఇళ్లవద్ద గంజాయి విక్రయాలు సాగుతున్నాయనే సమాచారంతో దాడి చేసి 11మంది యువకులను అరెస్ట్ చేసి 22 కిలోల గంజాయిని సీజ్ చేశామన్నారు. ఈ సందర్భంగా సుబ్బరాజుపేటకు చెందిన డొంకా ప్రవీణ్‌కుమార్, రైల్వే క్వార్టర్స్ సమీపంలో నివాసముండే ఆముదాల రవి, దేవరపల్లికి చెందిన కొప్పాక అఖిల్‌కుమార్, పల్లంట్లకు చెందిన దొండపాటి గంగాధర్, నిడదవోలు మండలం కంసాలిపాలేనికి చెందిన ఎలిచర్ల మిథున్‌దాస్, నిడదవోలుకు చెందిన కాకి పవన్, మజ్జి భానుప్రకాష్, కాకరపర్తి మహేష్, విశాఖ జిల్లాకు చెందిన కోరా రామచంద్రరావు, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన గోపీ గోలారి తదితరులను అరెస్ట్‌చేశామని సీఐ పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై పూర్తి స్థాయిలో ప్రత్యేక దృష్టిసారించామని, అందులో భాగంగానే ఈ దాడి నిర్వహించామన్నారు. సమావేశంలో పట్టణ ఎస్‌ఐలు పి.శోభన్‌కుమార్, పరమహంస తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొని.. యువతి మృతి


రేణుక మృతదేహం

కాకినాడ క్రైం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పండుగపూట ఇంటికి వెళ్లి తన కుటుంబంతో ఆనందంగా గడుపుదామనుకున్న తరుణంలో ఆ యువతిని మృత్యువు రోడ్డు ప్రమాదంరూపంలో కబళించింది. కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరానికి చెందిన డేగల రేణుక(18) రాజమహేంద్రవరంలో డిప్లమో కోర్సు చదివింది. అనంతరం కాకినాడ జగన్నాథపురంలోని తన అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ కంప్యూటర్ కోర్సు చదువుతోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి తన తాతయ్య ఏసుతో కలిసి ద్విచక్రవాహనంపై మెయిన్ రోడ్డుకు వెళ్లి కొత్త బట్టలు కొనుగోలు చేసి స్వస్థలానికి వెళ్లి నూతన వస్త్రాలు ధరించి పండగ చేసుకుందామనుకుంది. తాతతో కలిసి జగన్నాథపురం శివాలయంవద్ద ఉన్న ఇంటికి తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో వారి వాహనం ఘాటీ సెంటర్ సమీపంలోని చేపలమార్కెట్ వద్దకు వచ్చేసరికి వేగంగా వస్తున్న లారీ వారి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో రేణుక ఎగిరిపడి తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. అది గమనించిన స్థానికులు ఆమెను జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. అనంతరం వన్‌టౌన్ ఎస్‌ఐ స్వామినాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్తమూరులో ఎరువుల వ్యాపారి రూ.2.3కోట్ల మేర కుచ్చుటోపీ

మండపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అతడో ఎరువుల వ్యాపారి గ్రామంలో ఉన్న బంధువులు, స్నేహితులు అందరితో కలుపుగోలుగా ఉంటున్నట్టు నటిస్తూ చాలామంది నుంచి ఒకరికి తెలియకుండా మరొకరివద్ద వ్యాపారం కోసమని వడ్డీ ఇస్తానని నమ్మబలికి రూ.2.3కోట్ల మేర అప్పుగా నగదును తీసుకుని ఊరువదిలి ఉడాయించిన వ్యాపారి ఉదంతమిది. బాధితుల కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన గోలుగూరి గౌరిశంకర్‌రెడ్డి గ్రామంలో ఎరువుల దుకాణం నడుతున్నాడు. దుకాణానికి వచ్చే బంధువులైన రైతుల నుంచి, పరిచయం ఉన్న బాగా తెలిసిన రైతులనుంచి రూ.లక్షల్లో అప్పులు చేసి వడ్డీ చెల్లించకపోవడం, అసలు ఇవ్వకపోవడం ఆరునెలలగా జరుగుతోంది. కాగా, అతడు ఇటీవల ఎరువుల దుకాణంతోపాటు తన ఇంటికి తాళం వేసి కనిపించకుండాపోయాడు. అతడికి ఫోన్ చేసినా పనిచేయకపోవడంతో బాధితులంతా తాము మోసపోయామని గ్రహించి అర్తమూరులో వున్న అతడి ఇంటివద్ద రెండురోజులుగా ఆందోళనకు దిగారు. బంధువులు, స్నేహితులు, సన్న,చిన్నకారు రైతులే లక్ష్యంగా వారి నుంచి భారీగా నగదును అప్పుగా తీసుకుని బోర్డు తిప్పేయడంతో అసలు ఏం చేయాలో తెలియడం లేదని బాధితులు వాపోతున్నారు. అతడి కుటుంబసభ్యులు కూడా తమకు సమాధానం చెప్పడం లేదని బాధితులు వాపోతున్నారు. ఇప్పటివరకు 40మంది వరకు అప్పులు ఇచ్చిన బాధితులు ఉన్నారని తెలుస్తోంది. ఇక చేసేదిలేక వ్యాపారికి చెందిన ఇంటికి తాళంవేశారు. శనివారం బాధితులు అంతా అర్తమూరులో పరారీలో ఉన్న రెడ్డి ఇంటివద్ద ఆందోళన చేశారు.

కూలి పనులు చేసుకుని జీవనం సాగించే సన్న, చిన్న కారులతోపాటు చాలామంది వద్ద ఒకరికి తెలియకుండా మరొకరినుంచి భారీగా నగదును అప్పులుగా చేసి గ్రామంలో పత్తాలేకుండా వ్యాపారి పోవడంతో అసలు ఏం చేయాలో తెలియని పరిస్థితిలో బాధితులు ఉన్నారు. తమకు జరిగిన నష్టం మోసపోయిన వ్యవహారంపై బాధితులు పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామంలో ఎరువులు వ్యాపారం నిర్వహించే వ్యాపారి బారిన ఎరువులు సరఫరా చేసిన సంస్థల ప్రతినిధులు కూడా ఉన్నారు. తాము కూడా భారీగా నగదు అప్పుగా ఇచ్చామని వారు లబోదిబోమంటున్నారు.

పోలవరం ప్రాజెక్టు పనులు పరిశీలించిన పార్లమెంట్ కమిటీ సభ్యులు

రాత్రికి రాజమండ్రిలో సందడి

రాజమహేంద్రవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పార్లమెంటరీ జలశక్తి స్టాండింగ్ కమిటీ సభ్యులైన 11మంది ఎంపీలు శనివారం పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. కమిటీ చైర్మన్ రాజీవ్ ప్రతాప్ రూడీ ఆధ్వర్యంలో ఎంపీలు శుక్రవారం రాత్రి రాజమండ్రి వచ్చిన సంగతి తెలిసిందే. శనివారం ఉదయం వెళ్లి తిరిగిరాత్రికి రాజమండ్రికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం విమానాశ్రయం నుంచి తిరిగి తమ ప్రాంతాలకు చేరుకుంటారు. ఈ ఎంపీల బృందం ముందుగా పోలవరం ప్రాజెక్టులోని స్పిల్‌వే ప్రాంతాన్ని సందర్శించింది. తర్వాత ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పరిశీలించి, ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ కట్టే ప్రాంతంలో నిర్మించనున్న డయాఫ్రంవాల్ గురించి ఆరా తీశారు. ఫొటో ఎగ్జిబిషన్లను కూడా పరిశీలించారు. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్,పోలవరం ఈఎన్‌సీ మామిడి వెంకటేశ్వరరావు ప్రాజెక్టు గురించి వివరించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, డయాఫ్రంవాల్ గురించి ఎక్కువగా అడగడం గమనార్హం. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు ఎందుకనే సందేహాన్ని కూడా వెలిబుచ్చినట్టు సమాచారం.

అన్యమత ప్రచారాన్ని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యం

బండారులంకలో ఉద్రిక్తత.. సద్దుమణిగిన వివాదం


బండారులంకలో ఏజీ రోడ్డుపై ఆందోళనకు దిగిన కార్యకర్తలు

అమలాపురం రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అన్యమత ప్రచారాన్ని అడ్డుకున్న వారిపై దౌర్జన్యానికి దిగడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోలీసులు రంగప్రవేశం చేసి దౌర్జన్యానికి దిగిన వారితో క్షమాపణ చెప్పించడంతో వివాదం సద్దుమణిగింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ బండారులంక బ్యాంకు కాలనీ వీధికి ఒక మతానికి చెందిన వారు ప్రత్యేక బస్సులో చేరుకున్నారు. అక్కడినుంచి ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచుతూ మత ప్రచారం చేశారు. అక్కడే ఉంటున్న బళ్లసాయినాగమల్లేశ్వరరావు కుటుంబం వద్దకు వచ్చేసరికి ఆయన ఎందుకు అన్యమత ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. దీంతో ఆగ్రహించిన వారు ఒక్కసారిగా దౌర్జన్యానికి దిగారు. వారికి, స్థానికులకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పలువురు నాయకులు రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు ఆందోళనకారులతో చర్చలు జరిపి అవతలి వర్గం వారితో క్షమాపణ చెప్పించడంతో వివాదం సద్దుమణిగింది.

బావిలో పడి వ్యక్తి అనుమానాస్పద మృతి

పిఠాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో బావిలో పడి వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించి ఉండగా శనివారం పోలీసులు కనుగొన్నారు. పట్టణంలోని మాధవపురం రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిసమీపంలోని బావిలో పడి కుళ్లిపోయి ఉన్న యువకుడి మృతదేహాన్ని వెలికితీశారు. ఇతనిని ఇందిరానగర్‌కు చెందిన గారా జాన్(43)గా గుర్తించారు. ఎలా మరణించాడన్న అంశంపై పిఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు సంస్కృతిని విశ్వవ్యాప్తం చేద్దాం

సంక్రాంతి సంబరాల్లో అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు



పందెం బరిలోకి కోడి పుంజులు వదులుతున్న ఎమ్మెల్యే ఆనందరావు, టీడీపీ నేత రమణబాబు

ఉప్పలగుప్తం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మన తెలుగుసంస్కృతిని, తెలుగు భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. గొల్లవిల్లి అరిగెల వెంకటనరసింహారావు వ్యవసాయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతుల హర్షధ్వానాల మధ్య ఎడ్ల బండిపై గ్రామంలో సందడి చేశారు. సంక్రాంతి పండుగలో భాగమైన కోడి పందేలను ప్రారంభించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ, అరిగెల నరేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్నా, కూటమి నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, వుండ్రు రాజబాబు, గుత్తాల సుభాష్‌చంద్రరావు, పిల్లా బుజ్జి, సలాది శ్రీనివాస్, గాలిదేవర సురేష్, చిక్కం ఉమేష్, మల్లాడి వెంకటరమణ, అర్థాని శ్రీను, గుత్తుల నాగేశ్వరరావు, గొలకోటి చిట్టిబాబు, కాగిత సత్యనారాయణ, చిక్కం వెంకటకృష్ణ, వివిధ గ్రామాల యువకులు పాల్గొన్నారు.

రూ.2.58 కోట్లతో 123 గోకులం షెడ్లు

ఉప్పలగుప్తం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అమలాపురంనియోజకవర్గంలో రూ.2.58 కోట్లతో 123 గోకులం షెడ్లు నిర్మిస్తున్నట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. గొల్లవిల్లిలో గోకులం షెడ్డును శనివారం ఆయన ప్రారంభించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన జరిగిన రైతుల సమావేశంలో మాట్లాడారు. వాడపర్రులో సీసీ రహదారిని ప్రారంభించారు. కార్యక్రమంలో అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు జొన్నాడ శ్రీదుర్గాచిన్నా, చిక్కం జంగమయ్య, నల్లా బాబండి, నీటి సంఘాల ఛైర్మన్లు మోటూరి రవిశంకరకుమార్, నల్లా సత్యనారాయణ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, కూటమినాయకులు మద్దింశెట్టి సీతారామస్వామి, గొలకోటి సత్తిరాజు, సలాది నాగరాజు, మంచెం బాలకృష్ణ, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, అరిగెల నరేష్, పెయ్యల దుర్గారావు, రవణం మధు, బూసి బుజ్జిదొర పాల్గొన్నారు.

వారి పాఠాల వల్లే ఈనాడు ఉన్నత స్థాయిలో ఉన్నాం

ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహరావు



వెంకట సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

పి.గన్నవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆనాడు గురువులు చెప్పిన పాఠాలు వల్లే ఈనాడు ఉన్నత స్థాయిలో ఉన్నామని ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ కొండా నరసింహారావు అభిప్రాయపడ్డారు. పి.గన్నవరం హైస్కూల్లో శనివారం జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో ఆయన పూర్వ విద్యార్థిగా పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పి.గన్నవరం హైస్కూలు 1972 వరకు అప్పర్ ప్రైమరీగా ఉండేదని, అప్పటి ప్రధానోపాధ్యాయుడు ముద్రప్రగడ వెంకట సుబ్బారావు హైస్కూలుగా అనుమతి తీసుకొచ్చారని గుర్తు చేశారు. మరో పూర్వ విద్యార్థి, విశ్రాంత ఎంఈవో కోట రామమోహనరావు మాట్లాడుతూ దాతల సహకారంతో స్థలం ఏర్పాటు చేసి హైస్కూలు ఆవిర్భావానికి కృషి చేసిన వెంకటసుబ్బారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి తామంతా నిర్ణయించుకున్నట్టు ప్రకటించారు. అందుకు అనుమతి కోసం సంబంధిత అధికారులకు వినతిపత్రం అందించామన్నారు. విగ్రహం ఏర్పాటుతో పాటు పాఠశాల అభివృద్ధి నిమిత్తం పూర్వ విద్యార్థులతో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అప్పటి గురువు పి.వ్యాఘ్రేశ్వరశాస్త్రిని ఘనంగా సన్మానించారు. విశ్రాంత ఏఎస్ఐ పసుపులేటి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు డీఎస్వీ ప్రసాద్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నల్లా దుర్గారావు, నల్లా పెద్దకాపు, అడ్డాల రామకృష్ణ, బొరుసు శేఖర్, యర్రంశెట్టి ఆదినారాయణ, డొక్కా భీముడు తదితరులు పాల్గొన్నారు.

కోడూరుపాడులో ఓవర్ హెడ్ ట్యాంకు ప్రారంభం

అల్లవరం జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరుపాడులో ఓఎన్జీసీ సీఎస్సార్ నిధులు రూ.31.5 లక్షలతో నిర్మించిన మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకును అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శనివారం ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ నడింపల్లి సుబ్రహ్మణ్యరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, గుబ్బల రామ్‌ప్రసాద్, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.స్వామి, పీఆర్‌ఏసీ సయ్యద్ ఫకీర్, రాసూరి రాంబాబు, పిల్లా ప్రసాద్ పాల్గొన్నారు.

14 నుంచి ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల నిషేధం



దుకాణదారురాలికి నోటీసు అందజేస్తున్న అధికారులు

అయినవిల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశాల మేరకు అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యాపారులు ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు వాడరాదని అయినవిల్లి పంచాయతీ కార్యదర్శి కె.రామచంద్రరావు శనివారం తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి నిషేధం అమలులోకి వస్తుందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వ్యాపారులకు నోటీసులు అందజేశారు.

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

అమలాపురం రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్రం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఈదరపల్లిలోని శ్రీరవితేజ డిగ్రీ కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పట్టణ సీఐ పి.వీరబాబు మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. కరస్పాండెంట్ జీవీకే నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్రీడా పోటీల్లో విజేతలకు సీఐ వీరబాబు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో జీవీఎల్ పార్వతి, ప్రిన్సిపాల్ కె.దొరబాబు, ప్రసాద్,రమేష్, నెహ్రూ యువ కేంద్రం వలంటీరు కాశిన ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దర్శకుడు సుకుమార్ జన్మదిన వేడుకలు

అమలాపురం రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ దర్శకుడు బండ్రెడ్డి సుకుమార్ జన్మదిన వేడుకలను ఈదరపల్లిలోని హరి మనోవికాస కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఏలూరి అయ్యప్ప ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగుల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికీ పంచారు. భవిష్యత్తులో సుకుమార్ మరిన్ని ఘన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కంచిపల్లి శ్రీను, వర్ధమాన సినీ గేయ రచయిత శ్రీనివాస్‌సూర్య, తిరుమనాథం శ్రీను, కొర్లపాటి భరత్, యేడిద శ్రీను, రాము పాల్గొన్నారు.

'పనైనా చెప్పండి.. తిండైనా పెట్టండి'

అమలాపురం టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పనైనాచెప్పండి.. తిండైనా పెట్టండి నినాదంతో వలంటీర్ల అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్లకార్డులు చేతబూని అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. సంఘ గౌరవాధ్యక్షుడు కె.సత్తిబాబు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు వలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేసి ఉపాధి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా సహ కన్వీనర్ వరదా వెంకటానంద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

యానాం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు ఫల, పుష్ప ప్రదర్శన నిర్వహించిన సంగతి తెలిసిందే. యానాం ప్రజలకు, మహిళలకు, విద్యార్థులకు ముగ్గులు, వంటలు, కురగాయలు, మిద్దె తోటల పెంపకం అంశాల్లో పోటీలు నిర్వహించారు. ప్రదర్శన ముగింపు రోజున గవర్నర్ కొందరు విజేతలకు బహుమతులు అందజేశారు. మిగిలిన వారికి పరిపాలనాధికారి మునిస్వామి, వ్యవసాయ శాఖ డీడీ శివ సుబ్రహ్మణన్ శనివారం బహుమతులు అందించారు.

ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవ ర్యాలీ

అమలాపురం రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆర్టీసీ కార్గో సేవలను మరింత విస్తృతపరిచి డోర్ డెలివరీ సౌకర్యం కల్పిస్తున్నట్టు అమలాపురం డిపో మేనేజర్ సీహెచ్‌ఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ నెల 19వ తేదీ వరకు కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శనివారం డిపో నుంచి చేపట్టిన ర్యాలీలో మేనేజర్‌తో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఏటీఎం కె.మాధవి, ఎంఎఫ్ జీఆర్ఎల్ దేవి, డీఎంఈ కేవీ కుమార్, గ్యారేజీ సిబ్బంది, హమాలీలు పాల్గొన్నారు.





మామికుదురు, ఐ.పోలవరం మండలాల్లో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న రాజోలు, ముమ్మిడివరం ఎమ్మెల్యేలు వరప్రసాద్, బుచ్చిబాబు

గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి కృషి

ముమ్మిడివరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రోడ్లను ఆధునికీకరించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. మండలంలోని చినకొత్తలంక, అయినాపురం గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మితమైన సిమెంటు రోడ్లు, గోకులం షెడ్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.2.85 కోట్లతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. చినకొత్తలంకలో రూ.10.04 లక్షలతో నిర్మితమైన రోడ్లను, రెండు గోకులం షెడ్లను, అయినాపురంలో 30.06 లక్షలతో శాలిపేట, బొర్రావారిగట్టు, మోకావారిపేట, వీధుల చెరువు గ్రామాల్లో నిర్మితమైన రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, మాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చెల్లి అశోక్, నాయకులు తాడి నరసింహారావు, గొలకోటి దొరబాబు, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, గొల్లపల్లి ధర్మారావు, గీసాల చంద్రరావు, పచ్చమట్ల రవివర్మ, చిక్కాల బాబులు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, కుంచనపల్లి నారాయణ, బొంతు నాగరాజు, మోకా రామారావు, పి.ఉమారాణి, ఎంపీటీసీ వీణారాణి, ఇందుకూరి పాండురంగరాజు, పెద్దిరెడ్డి సత్యగోపాలకృష్ణ, గుత్తాల దుర్గ, యాళ్ల ఉదయ్, సత్తి నూకరాజు, మట్ట సత్తిబాబు, దంగేటి ఎను, దూడల స్వామినాయుడు, గొలకోటి ఫణీంద్ర, వీపూరి నాగరాజు, కురసాల శివబాబు, కొత్తూరి మల్లికార్జునవర్మ, కాశి లాజర్, బూరుగు కల్యాణ్, గోదశి గణేష్, గుద్దటి జమ్మి, టీవీవీ సత్యనారాయణరాజు, ఎంపీపీ కోలా గంగాభవాని, ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య, పంచాయతీరాజ్ డీఈఈ పి.విజయ్‌శ్రీనివాస్, ఈవోపీఆర్డీ సీహెచ్ లక్ష్మీకల్యాణి, ఏపీవో డి.వెంకటేశ్వరరావు, గేదెల రఘునాథబాబా పాల్గొన్నారు.

ఐ.పోలవరం (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాల్లోను అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మండలంలోని ఐ.పోలవరం కాలేవారి వీధిలో రూ.17.78 లక్షలు, గుత్తెనదీవిలో రూ.17.71 లక్షలు, ఎదుర్లంకలో రూ.14.23లక్షలు, కొమరగిరిలో రూ.39. 67లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను ఆయన ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, దాట్ల పృథ్వీరాజు, సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్, ఎంపీపీ మోర్త రాణీమిరియంజ్యోతి, సర్పంచ్‌లు కాలే రాజబాబు, లంకలపల్లి దుర్గాదేవీమునిరాజు, ముదునూరి పద్మఅర్జునరాజు, వరసాల విజయచాముండేశ్వరీసూర్యనారాయణ, జంపన బాబు, ఏలూరి మూర్తి, దాట్ల రామకృష్ణంరాజు, కాలే సహదేవుడు, చిక్కాల శ్రీను, గంగాబత్తుల సన్యాసిరావు, పెంట రవి, ముదునూరి లింగమూర్తిరాజు, సాగి వాసురాజు, ముదునూరి శ్రీనురాజు, ముదునూరి వాసురాజు, ముదునూరి బుజ్జిరాజు, గాదిరాజు బుచ్చికృష్ణంరాజు, పెన్మెత్స శరత్, ఆకుల సత్తిబాబు, పెన్మెత్స కిశోర్, ఆచంట సుభాష్, మహదశ లక్ష్మీనారాయణ, జేఈ నరహరి, పంచాయతీ కార్యదర్శులు పి.రవిరాజు, బి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మామిడికుదురు నుంచి కొర్లగుంటకు ఉపాధి హామీ నిధులు రూ.29 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డెల్టా నీటి సంఘం అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, నాయకులు మొల్లేటి శ్రీనివాస్, గుండుబోగుల పెద్దకాపు, బోనం బాబు, ఈలి శ్రీనివాస్, నయినాల సత్యనారాయణమూర్తి, కడలి నూకరాజు, చుట్టుగుళ్ల కిశోర్, వర్ధినేని వెంకట్రామయ్య, మట్టా సత్తిబాబు, ఇంటి మహేంద్ర, రుద్ర శ్రీనివాస్, కడలి కృష్ణమోహన్‌పాల్గొన్నారు.

మామిడికుదురు బుల్లోడు వంతెన నుంచి షిర్డిసాయి ఆలయం వరకు డ్రైన్ ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతవాసులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. కడలి నూకరాజు, కాండ్రేగుల శ్రీనివాస్, నానాజీ పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మలికిపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మలికిపురం ఏఎఫ్‌డీటీ జూనియర్ కళాశాల 1989-91 బ్యాచ్ బైపీసీ గ్రూపు విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని భావోద్వేగానికి లోనయ్యారు. తమకు చదువు నేర్పిన అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో మాధవి, సుధాలీల, మిల్టన్, బాలు, చింతపల్లి శ్రీనివాస్, కరీమ్, అడబాల శ్రీనివాస్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



'కంకిపాటి'కి అనాటోలీ అవార్డు

అమలాపురం టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంత్యుత్సవాన్ని శనివారం అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్‌లో డాక్టర్ రాయుడు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కంకిపాటి వెంకటేశ్వరరావు కృషిని డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి అభినందించారు. వెంకటేశ్వరరావుకు ఆంధ్ర అనాటోలీ అవార్డును హైకోర్టు న్యాయవాది ముషిణి రామకృష్ణారావు అందజేశారు. కార్యక్రమంలో వి.ధనరాజు, విష్ణు, జిమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జయంతి

అమలాపురం టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని ప్రిన్సిపాల్ కె.మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివేకానందుని చిత్రపటానికి కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కరాటం ప్రవీణ్, యాలంగి వరప్రసాద్, ముషిణి రామకృష్ణారావు, రాయుడు శ్రీరామచంద్రమూర్తి, నీలి సంసోను, కె.శ్రావణ్‌దిలీప్, డాక్టర్ హేమవిజిత, శ్రీలక్ష్మి, స్నేహిత తదితరులు పాల్గొన్నారు



అల్లవరం మండలం ఓడలరేవు బీవీసీ కళాశాలలో...



కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో...



ప్రభను ఊరేగిస్తున్న పి.గన్నవరం సాయితేజ స్కూలు విద్యార్థులు

ఊరూరా సంక్రాంతి సంబరాలు

అల్లవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు జరిపారు. భోగి మంటలు, పిండి వంటలు, ప్రభల ఊరేగింపు ఆకట్టుకున్నాయి. విద్యార్థినులు ముగ్గుల వద్ద నృత్యాలు చేశారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. సంక్రాంతి సంబరాలు,యువజన ఉత్సవాల్లో కళాశాల సెక్రటరీ బోనం కనకయ్య, ఛైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ డి.మహేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆకుల ప్రవీణ్, ఎన్.శివకుమార్, డాక్టర్ ఎస్.శ్రీకాంత్, వైవీ రమణమూర్తి, తోరం శరణ్‌కుమార్, బీఎస్ఎన్ మూర్తి, షేక్ మీరాషరీఫ్, ఎ.దుర్గామాధురి, ఏవై ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన (ఆంధ్రజ్యోతి): చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగు కళాశాల ఆవరణలో విద్యార్థినులు ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి, భోగి మంటలు చుట్టూ తిరుగుతూ సంక్రాంతి లక్ష్మి పాటలు పాడారు. హరిదాసు కీర్తనలు, తెలుగింటి పిండి వంటలు, రంగవల్లులు, డూడూబసవన్నలతో సంక్రాంతి శోభ సంతరించుకుంది. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. జేఎన్టీయూకేకు చెందిన బి.బాలకృష్ణ, కరస్పాండెంట్ డీవీఎన్ఎస్ వర్మ, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసకుమార్, శ్రీసందీప్, ఎస్.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం సాయితేజ విద్యా సంస్థల ఛైర్మన్ అన్నాబత్తుల హనుమాన్, ప్రధానోపాధ్యాయుడు సుంకర వెంకటకృష్ణ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఉదయం రంగవల్లికలు వేసి గొబ్బెమ్మల వద్ద పాటలు పాడారు. ప్రభనుపోలీస్‌స్టేషన్ వరకు ఊరేగించి భోగి మంట వేశారు. రంగవల్లికల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. గ్రేస్ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి.

అమలాపురం టౌన్ (ఆంధ్రజ్యోతి): అమలాపురం సూర్యబలిజ సంఘం ఆధ్వర్యంలో శనివారం చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి ప్రారంభించారు. పోలిశెట్టి అనంతలక్ష్మీదేవి, మునుకోటి లక్ష్మీదేవి, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. మట్టపర్తి ధనలక్ష్మి, పెమ్మాడి అరుణకుమారి, యండమూరి హేమవతి వరుస స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వారితోపాటు పాల్గొన్న ప్రతి మహిళకు కన్సొలేషన్ బహుమతి అందజేశారు. మద్దుల గోపాలకృష్ణ, కాశే సురేష్, యండమూరి శివకేశవ, పందిరి శ్రీనివాస్, ధరణికోట శ్రీనివాసరావు,భాస్కర్ల రవితేజ, కాశే వెంకన్న, వాల్మీకి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంనగర పంచాయతీ చింతలమెరకలో సంధ్యా గురుకులంలో శిక్షక్‌లు మట్టపర్తి సిరి, మీనాకుమారి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారులకు భోగి పళ్లు పోశారు. జిల్లా పర్యవేక్షకుడు లక్ష్మీనారాయణ, శిక్షక్‌ల కో-ఆర్డినేటర్ మహి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ప్రభలను ఊరేగించి, భోగి మంటలు వేశారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి హేమసుందరి, రెడ్డి శివన్నారాయణ, మట్టపర్తి సత్యనారాయణ, గుబ్బల శంకరదాసు, మట్టపర్తి శ్రీనివాస్, రెడ్డి సూర్యనారాయణ, నాగరమేష్, సునీల్, దొమ్మేటి విజయ్‌కుమార్, మట్టపర్తి వెంకటరమన, కొప్పిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



దిండి రిసార్ట్స్‌ను సందర్శిస్తున్న మంత్రి దుర్గేష్

'నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి'

మలికిపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దిండిలోని హరిత కోకోనట్ రిసార్ట్స్‌ను పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శనివారం సాయంత్రం సందర్శించారు. రిసార్ట్‌లో జరుగుతున్న నిర్మాణాల గురించి అధికారులతో అడిగి తెలుసుకున్నారు. వెంటనే పూర్తిచేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ ఎడ్యుకేషన్ సెంటర్ ప్రారంభం

అంతర్వేది, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం మోరిపోడు లో కమ్యూనిటీ ఎడ్యుకేషన్ సెంటర్‌ను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం ప్రారంభించారు. డార్విన్ నిర్వహించే ఎడ్యుకేషనల్ సంస్థల్లో భాగంగా ఆసుపత్రిని కలెక్టర్ మహేష్‌కుమార్ పరిశీలించారు. డాక్టర్ లతాపాల్, డార్విన్ ప్రజలకు అందిస్తున్న సేవలను కలెక్టర్‌కు వివరించారు.

పెదపట్నంలంక ఇసుక ర్యాంపులో అవకతవకలు

విచారణ జరిపించాలని బీజేపీ నాయకుల డిమాండ్

మామిడికుదురు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంకలో రెండు నెలలుగా నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపుల్లో జరుగుతున్న అవకతవకలపై బీజేపీ నాయకులు శనివారం నిరసన తెలిపారు. గ్రామంలో ఇసుక అమ్మకాలపై సభ పెట్టి పడవ వారికిరూ.900, ట్రాక్టరు వారికి రూ.500, మేనేజ్‌మెంట్‌కు అదనంగా రూ..200, అదనంగా కలిసి ట్రాక్టరుకు రూ.1600 తీసుకున్నారన్నారు. ఇప్పటివరకు సుమారు 500 ట్రాక్టర్ల ఇసుక తీశారన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి రూ.1800 పెంపుచేసి తీసుకున్నారని, కానీ సర్పంచ్ రూ.వెయ్యి ఇచ్చి ఎవరైనా ఇసుక తీసుకువెళ్లవచ్చని సామాజిక మాధ్యమంలో చెప్పారన్నారు. 11వ తేదీ నుంచి మరలా రూ.1,800 తీసుకుంటూ మేనేజ్‌మెంట్ కింద రూ.300 చొప్పున తీసుకుంటున్నారని, ఈ వసూలు చేసి సొమ్ము గురించి అడగ్గా అధికారులు, ప్రజాప్రతినిధులకు ఇస్తున్నారన్నారు. ట్రాక్టరుకు రూ.300 అదనంగా తీసుకోవడం ఎంతవరకు సమంజసమని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వేగి వెంకటేశ్వరరావు, ఐటీ సెల్ కన్వీనర్ కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, సోషల్‌మీడియా కన్వీనర్ వీరవెంకటసత్యనారాయణ ఇసుక ర్యాంపులో జరుగుతున్న అవకతవకలపై శనివారం ప్రశ్నించారు. అధికారులు స్పందించి విచారణ జరిపించాలని కోరారు.

'అమిత్ షాను బర్తరఫ్ చేయాలి'

మామిడికుదురు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమాన పరిచేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షాను కేంద్ర కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని నగరం గ్రామంలో శనివారం సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించడమంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు.సీపీఎం నాయకుడు పీతల రామచంద్రరావు, సీపీఐ నాయకుడు ఎన్.బుచ్చిబాబు, ఆప్‌ఆద్మీ పార్టీ నాయకుడు నల్లి శ్రీనివాస్, మాలమహానాడు నాయకుడు బొంతు మణిరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అయితాబత్తుల సుభాషిణి, మాచవరపు శివన్నారాయణ, మహ్మద్ ఆరీఫ్, సరెళ్ల ప్రసన్నకుమార్, అప్పన శ్రీరామకృష్ణ, వంటెద్దు బాబి, బొంతు రాజేంద్రప్రసాద్, వడ్డి నాగేశ్వరరావు, కుడుపూడి శ్రీను, దోనిపాటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ రైతుల నిరసన

రాజోలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుచేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని శివకోటికి చెందిన రైతులు 216 జాతీయ రహదారిపై ధాన్యం బస్తాల లోడుతో ఉన్న ట్రాక్టరును అడ్డుగా పెట్టి శనివారం నిరసన తెలిపారు. రైతు భరోసా కేంద్రం ఉద్యోగి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియాను కూడా అందుబాటులో ఉంచట్లేదన్నారు. ఆర్బీకే ఉద్యోగి నిర్లక్ష్యం వల్ల పలు రకాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు బోళ్ల వెంకటరత్నం, రేకపల్లి సత్యనారాయణ చెప్పారు. దీంతో పోలీసు, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేశారు. దీంతో రైతులుశాంతించారు. రైతులు గంగాధర రామారావు, తోలేటి శివాజీ, కొమ్మాడి నాగేశ్వరరావు, కోళ్ల నానాజీరావు పాల్గొన్నారు.



ఆలయ సిబ్బంది సమక్షంలో బంగారు గొలుసు అందిస్తున్న బుజ్జి

భక్తుడి నిజాయితీ

ఐ.పోలవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో దొరికిన బంగారు గొలుసును సిబ్బందికి అప్పగించి ఒక భక్తుడు నిజాయితీ చాటుకున్నాడు. ఈ నెల 10వ తేదీ రాత్రి కాకినాడకు చెందిన అనురాధ వీరేశ్వరస్వామి కల్యాణం చేయించుకునేందుకు వచ్చి రూ.50 వేలు విలువైన బంగారు గొలుసు పోగొట్టుకుంది. పశువుల్లంకకు చెందిన సలాది బుజ్జికి అది దొరికింది. ఆయన దానిని దేవస్థానం సిబ్బందికి అప్పగించాడు. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ సమక్షంలో అనురాధకు అప్పగించారు. బుజ్జిని సహాయ కమిషనరు మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు.

'రెక్కలు తెగిన స్వప్నం' నవల ఆవిష్కరణ

అంతర్వేది, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని బోయి భీమన్న సతీమణి, ప్రముఖ రచయిత్రి హైమావతి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రచయిత, కవి బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ కత్తిమండ ప్రతాప్ రాసిన 'రెక్కలు తెగిన స్వప్నం' నవలను ఆమె ఆవిష్కరించారు. హైమావతిని రచయిత ప్రతాప్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నల్లా విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్టు నల్లా సత్యకృష్ణకిరణ్‌ప్రసాద్, గొల్ల లలిత, మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే వేగుళ్ల



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం రాయవరం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసి సర్పంచ్‌లను బిక్షాటన చేసేలా చేస్తే ప్రభుత్వం పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి ఇచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతాలను ప్రగతిబాటలో నడిపేందుకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో 60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, మినీ గోకులం షెడ్లు, మెయిన్ పాఠశాలలో ఐటీసీ, పెద్దల సహకారంతో నిర్మించిన విద్యార్థుల భోజన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం స్థానిక చంద్రిక, లక్ష్మీ గణపతి రైస్‌మిల్లుల యాజమాన్యం సహకారంతో ఇచ్చిన 200 కిలోల బియ్యాన్ని పారిశుధ్య కార్మికులకు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఉండవిల్లి రాంబాబు, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు వెలుగుబంట్ల గోపీకృష్ణ తదితరులతో పాటు ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.12.50 కోట్లకు సామాజిక తనిఖీలు



సామాజిక తనిఖీ చేస్తున్న అధికారులు

కె.గంగవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండల పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో చేసిన రూ.12.50 కోట్ల అభివృద్ధి పనులకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో డ్వామా పీడీ మధుసూదనరావు ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ చేశారు. మండలంలోని 26 గ్రామాల్లో నిర్వహిం చిన పనులు, వాటిని ఆడిట్ చేసిన బృందాలు తమ నివేదికలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు, ఏపీవో గణపతి, ఈసీ సాగర్, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

ఏపీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు బాలాజీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కానుకగా ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని వక్తలు డిమాండు చేశారు. శనివారం విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏపీ ఉపాధ్యాయ సంఘం అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమావేశం జరిగింది. సభలో ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.బాలాజీ, జీవీ సత్యనారాయణ మాట్లాడారు. ఐఆర్‌తోపాటు పెండింగ్ డీఏలు ప్రకటించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

జిల్లా అధ్యక్షుడిగా వాడ్రేవు శ్రీనివాస్: జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా వాడ్రేవు సుబ్రహ్మణ్య శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓలేటి శాస్త్రి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరేష్‌బాబు, కె.గంగవరం ఎంఈవో నాగరాజు, నాయకులు పీఎస్‌వీవీ ప్రసాద్, సాంబశివరావు, పోలిశెట్టి మూర్తి, కాజా మొహిద్దీన్, చెరుకు సుబ్రహ్మణ్యం, ఎం.సత్యనారాయణ, వి.వాసు తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్మించిన గోకులం షెడ్‌ను శనివారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీవో పి.శ్రీకర్ ప్రారంభించారు. ప్రభుత్వం పాడి రైతులను ఆదుకునేందుకు గోకులం షెడ్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యే వేగుళ్లకు వినతిపత్రం ఇస్తున్న భవన నిర్మాణ కార్మికుల సంఘం నేతలు

రాయవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామంలో భవన నిర్మాణ కార్మికులకు సామాజిక భవనం నిర్మించేందుకు స్థలం కేటాయించాలని శ్రీభక్తాంజనేయ భవన నిర్మాణ కార్మికుల సంఘం నేతలు శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. కార్మికులంతా భక్తాంజనేయ భవన నిర్మాణ కార్మికులుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ప్రతినెలా సమావేశం జరిపేందుకు స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేత ఉండవిల్లి రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, భవన నిర్మాణ కార్మికుల సంఘం నేతలు కర్రి తాతారావు, బేర దుర్గా ప్రసాద్, గండి చంద్రశేఖర్, లంక చందు, కాకరపర్తి శ్రీను, బండే సోమరాజు తదితరులు పాల్గొన్నారు.



శని త్రయోదశి సందర్భంగా శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శని త్రయోదశికి పోటెత్తిన భక్తులు

స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.8.78 లక్షలు

కొత్తపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): శని త్రయోదశి సందర్భంగా మందపల్లి శనేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.8,78,540 ఒకరోజు ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా విజ్ఞాన్ కళాశాలలో సృజనోత్సవం

మండపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు రోడ్డులో వున్న విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో 2025 సృజనోత్సవం కార్యక్రమాన్ని శనివారం మండపేట మున్సిపల్ కమీషనర్ టీవీ రంగారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు, సాంస్కృతిక కార్యక్రమాలు అలవరుచు కోవటం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ బాబీ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ ఐఎస్‌డీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇనపకోళ్ల సత్యనారాయణ హాజరయ్యారు. సంస్థ డైరెక్టర్ ఇనపకోళ్ల గణేష్ చౌదరి, మల్లిపూడి గణేష్, ఆంగ్ల ఉపాధ్యాయులు, వీరా ద్విభాష్యం నగేష్‌బాబు, సాంస్కృత అధ్యాపకులు శ్రీనివాసాచార్యులు, కమీషనర్‌తో పాటు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు ఆటపాటలు, డాన్సులు, సంగీతం ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు ముగ్గులు, వ్యాసరచన పోటీలు, క్విజ్, చెస్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు విద్యాంసులు పాల్గొన్నారు.



సృజనోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రంగారావు

సంస్కృతి, సంప్రదాయాల కలయికే సంక్రాంతి



మండపేట సెయింట్ అన్స్ పాఠశాలలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాల కలయికే సంక్రాంతి అని అంచనాల కమిటీ రాష్ట్ర చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలోని సెయింట్ అన్స్ పాఠశాలలో శనివారం జరిగిన సంక్రాంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జోష్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విద్యార్థుల సంప్రదాయ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భోగిమంటలు, డూడు బసవన్నల సందడి తదితర కార్యక్రమాలు విద్యార్థులు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ చిట్టూరి సతీష్, ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రత్నాకర్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మరియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాయితేజా స్కూల్‌లో...

రాయవరం: రాయవరం సాయితేజా విద్యానికేతన్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు శనివారం ఘనంగా జరిపారు. అకడమిక్ డైరెక్టర్ కర్రి భానురేఖ, సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినిలు హరిదాసుకు బియ్యం వేసి, భోగి మంటలు వేశారు. విద్యార్థినిలు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పోలిమాటి సుధాకర్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోడరన్ విద్యా సంస్థల్లో...

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం పట్టణంలో మోడరన్ జీఆర్‌సీ జూనియర్ కళాశాలలో సంక్రాంతిని పురస్కరించుకుని జరి పిన ముగ్గుల పోటీల్లో 72 మంది హాజరయ్యారు. సంక్రాంతి శోభ, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. విజేతలకు, పోటీల్లో పాల్గొన్న మహిళలకు మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ ప్రకాష్, అకడమిక్ అడ్వైజర్ సీహెచ్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వీఎస్‌ఎంలో ఏర్పాట్లు పూర్తి: రామచంద్రపురం వీఎస్‌ఎం కళాశాలలో సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో 12, 13, 14 తేదీల్లో సంక్రాంతి సంబరాలు జరగనున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటలకు మంత్రి ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవ్ 2కె25 రన్ నిర్వహిస్తారు. ఆర్డీవో కార్యాలయం నుంచి ఉత్సవ్ రన్ ప్రారంభం అవుతుంది. వీఎస్‌ఎంలో మంత్రి హాట్ ఎయిర్ బెలూన్‌లు ఎగురవేసి సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభిస్తారు.

నేడు ముగ్గుల పోటీలు: సంక్రాంతి పురస్కరించుకుని ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు ప్రథమ బహుమతిగా వాషింగ్‌మిషన్, రెండో బహుమతిగా రిఫ్రిజిరేటర్, మూడవ బహుమతిగా స్మార్ట్ టీవీను అందించనున్నారు. నియోజకవర్గ ప్రజలు వీటిలో పాల్గొనాలని మంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

సంక్రాంతి వేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ల



రామచంద్రపురం మోడరన్‌లో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న జీవీ రావు

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

కొత్తపేట: సంక్రాంతి వేడుకల్లో అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ కోరారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ప్రభల ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించాలన్నారు. ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని 08855 244299 ఫోన్‌లో ప్రజలు ఫిర్యాదులు చేయవచ్చునని ఆర్డీవో శ్రీకర్ తెలిపారు.



రాయవరం సాయితేజా స్కూల్‌లో హరిదాసుకు బియ్యం వేస్తున్న విద్యార్థినిలు

సారాతో వ్యక్తి అరెస్ట్

ఆత్రేయపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం గ్రామానికి చెందిన పి.సత్యప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అన్నవరం తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని ఆధ్వర్యం వహించారని తెలిపారు.

సిద్ధమవుతున్న పందాలబరులు

• ప్రేక్షక పాత్రలో అధికారులు • ప్రకటనలకే పోలీసు హెచ్చరికలు



రావులపాలెంలో సిద్ధం చేస్తున్న పందాలబరి

రావులపాలెం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కోడిపందేల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చురుకుగా సాగిపోతున్నాయి. మండలంలోని రావులపాలెం, రావులపాడు, ఈతకోట, దేవరపల్లి, పొడగట్లపల్లితోపాటు పలు ప్రాంతాల్లో పందెం బరులను ఏర్పాటు చేసే పనిలో నిర్వాహకులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా స్థలాలను చదును చేస్తున్నారు. అక్కడే గుండాట, పేకాటలను నిర్వహించేందుకు క్యాబిన్లు ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారులు తిరిగే ప్రాంతాల్లో బరులు ఏర్పాటు చేస్తున్నా, వాటిని అడ్డుకునే దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపా లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీ చేసినా అధికారులు, పోలీసులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

మండపేట: సంక్రాంతిని పురస్కరించుకుని కోడి పందాలు, గుండాట నిర్వహణకు పందెపు రాయుళ్లు శనివారం వాటి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో 12 చోట్ల పందెం బరులు సిద్ధం అవుతున్నాయి. మండపేటలో 3, రూరల్‌లో 3, రాయవరంలో 3, కపిలేశ్వరపురం మండలంలో 3 చోట్ల పందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఎంపిక చేసిన ప్రదేశాల్లో పందేలు, గుండాట నిర్వహణతోపాటు మద్యం విక్రయాలు, బిర్యానీ సెంటర్లు, ఇతర వ్యాపారాలకు సంబంధించి నిర్వాహకులు వేలం నిర్వహించారని తెలిసింది. మూడు రోజులపాటు జరిగే ఈ పందేల వైపు పోలీసులు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మొత్తం మీద ఇప్పుడు 12 బరులు వున్నప్పటికి పండుగ నాటికి మరిన్ని పెరిగే అవకాశం లేకపోలేదని నిర్వాహకులు చెబుతున్నారు.



మండపేట మండలంలో పందాల కోసం ఏర్పాటు చేస్తున్న కంచె

వారి పాఠాల వల్లే ఉన్నతస్థాయిలో ఉన్నాం

ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు

పి.గన్నవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆనాడు గురువులు చెప్పిన పాఠాలు వల్లే ఈనాడు ఉన్నత స్థాయిలో ఉన్నామని ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ కొండా నరసింహారావు అభిప్రాయపడ్డారు. పి.గన్నవరం హైస్కూల్లో శని వారం జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో ఆయన పూర్వ విద్యార్థిగా పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పి.గన్నవరం హైస్కూలు 1972 వరకు అప్పర్ ప్రైమరీగా ఉండేదని, అప్పటి ప్రధానోపాధ్యాయుడు ముద్రప్రగడ వెంకట సుబ్బారావు హైస్కూలుగా అనుమతి తీసుకొచ్చారని గుర్తు చేశారు. మరో పూర్వ విద్యార్థి, విశ్రాంత ఎంఈవో కోట రామమోహనరావు మాట్లాడుతూ దాతల సహకారంతో స్థలం ఏర్పాటు చేసి హైస్కూలు ఆవిర్భావానికి కృషి చేసిన వెంకటసుబ్బారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి తామంతా నిర్ణయించుకున్నట్టు ప్రకటించారు. అందుకు అనుమతి కోసం సంబంధిత అధికారులకు వినతిపత్రం అందించామన్నారు. విగ్రహం ఏర్పాటుతో పాటు పాఠశాల అభివృద్ధి నిమిత్తం పూర్వ విద్యార్థులతో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అప్పటి గురువు పి.వ్యాఘ్రేశ్వర శాస్త్రిని సన్మానించారు. విశ్రాంత ఏఎస్ఐ పసుపులేటి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు డీఎస్వీ ప్రసాద్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నల్లా దుర్గారావు, నల్లా పెద్దకాపు, అడ్డాల రామకృష్ణ, బొరుసు శేఖర్, యర్రంశెట్టి ఆదినారాయణ, డొక్కా భీముడు తదితరులు పాల్గొన్నారు.



వెదురుమూడిలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

అభివృద్ధి, రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

కపిలేశ్వరపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి, రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని వెదురుమూడిలో ఉపాధి హామీ నిధులతో గ్రామంలోని 5 సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం ప్రారంభించారు. గ్రామానికి చెందిన శీలం వెంకటరమణ, గుత్తుల రాజు నిర్మించిన మినీ గోకులం షెడ్లులను కూడా ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగించిందన్నారు. వెదురుమూడితో పాటు కోరుమిల్లి, కపిలేశ్వరపురం, వల్లూరు, అచ్యుతాపురం, అద్దంకివారిలంక గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యిందన్నారు. రెండో ప్రపోజల్‌గా అంగర, కోరుమిల్లి, వాకతిప్ప, నాగులచెరువు, కేదార్లంక గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రపోజల్ పంపామన్నారు. సంక్రాంతి అనంతరం వాటికి కూడా శాంక్షన్ ఆర్డర్ రానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ముత్యాల వెంకట్రావు, రెడ్డి ప్రసాద్, పుత్సల శ్రీనివాస్, చుండ్రు రామకృష్ణచౌదరి, బోనం నానిబాబు, అనసూరి బూరయ్య, ఇళ్ళ రాంబాబు, గుత్తుల కృష్ణమూర్తి తదితరులతో పాటు మండల పరిషత్ ఏవో రాజేంద్రప్రసాద్, పంచాయతీరాజ్ జేఈ డీవీ రాఘవులు, ఏపీవో రవికిరణ్ తదితర అధికారులు, గ్రామస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

కొత్తపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ కళా వైభవానికి ప్రతీకలుగా బొమ్మల కొలువుకు ప్రత్యేక స్థానం ఉంది. సంక్రాంతి నేపథ్యంలో తెలుగు సంస్కృతిని ప్రతిబింబిం చేలా కొత్తపేట ప్రియదర్శిని బాలవిహార్‌లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు చూపరులను ఆకట్టుకుంటోంది. దేశ విదేశాల్లో ఎంతో ప్రాచుర్యం పొందుతున్న హస్తకళాకృతుల విశిష్టతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పాలనే సత్‌సంకల్పంతో బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రియదర్శిని బాలవిహార్ కరస్పాండెంట్ అద్దంకి బుద్ధ చంద్రదేవ్ తెలిపారు. బొమ్మల కొలువులో దేవతా మూర్తులు, పురాణ పురుషులు, యోగులు, సిద్ధులు, దేశ ప్రముఖులు, శాస్త్రవేత్తలు, వృత్తులు, శ్రమజీవులు, పక్షులు, జంతువులు, వాయిద్య పరికరాలు ఇలా ఎన్నో ఇందులో కొలువై ఉన్నాయి. ఈ బొమ్మలను చాలా వరకు కొండపల్లి, ఏటికొప్పాక, నిర్మల్, అజ్జరం, పెంబర్తి, కుంభకోణం, మహాబలిపురం, కోల్‌కతా, చెన్నపట్నం, గాడిలంక, కొత్తపేట తదితర ప్రాంతాల హస్తకళాకారులు రూపొందించిన బొమ్మలు కొలువు దీరాయి. కనుమరుగవుతున్న ఈ సంప్రదాయాన్ని స్కూల్ స్థాయిలో ఏర్పాటు చేసి విద్యార్థుల్లో భక్తి భావంతోపాటు విజ్ఞానతృష్ణను పెంచిన కళాప్రియులను పలువురు అభినందించారు.



ప్రియదర్శినిలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు



గోవుకు పశుగ్రాసం పెడుతున్న మంత్రి సుభాష్

గోకులం షెడ్డును ప్రారంభించిన మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం ఏరుపల్లిలో ఉపాధి హామీ పథకంలో నిర్మించిన గోకులం షెడ్డును శనివారం మంత్రి సుభాష్ ప్రారంభించారు. దీన్ని ప్రారంభించిన అనంతరం గోవులకు ఆయన పశుగ్రాసం వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సాక్షిశివ, మాజీ సర్పంచ్ చిల్లా గోపాలకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు పితాని వీరభద్రరావు, ఎంపీడీవో కడలి పద్మజ్యోతి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఈశ్వర్, పశు సంవర్ధకశాఖ ఏడి, పంచాయతీ విస్తరణ అభివృద్ధి అధికారి షెల్టర్ రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



వెదురుపాక విజయదుర్గా అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి ఉమా

విజయదుర్గా పీఠంలో మాజీ మంత్రి ఉమా పూజలు

రాయవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శనివారం మాజీ మంత్రి, కృష్ణా జిల్లా మైలవరం మాజీ ఎమ్మెల్యే దేవినేని ఉమా మహేశ్వరరావు పూజలు చేశారు. విజయదుర్గా అమ్మవారికి అర్చనలు, హారతులు నిర్వహించిన తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందిన అనంతరం మాజీ మంత్రికి వేదపండితులు ఆశీస్సులు అందించారు. గాడ్ సమక్షంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధి గాదే భాస్కరనారాయణ మాజీ మంత్రిని సత్కరించి జ్ఞాపిక అందించారు. మాజీ మంత్రి వెంట టీడీపీ మండల సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు వద్దాది పండు, పీఠం ప్రతినిధి గాదే కృష్ణ తదితరులు ఉన్నారు.



భీమేశ్వరస్వామిని దర్శించుకున్న నిత్య విద్యానందభారతీస్వామి

భీమేశ్వరునికి నిత్యవిద్యానంద భారతీస్వామి పూజలు

ద్రాక్షారామ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని శనివారం నిత్య విద్యానంద భారతిస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం వేదాశీర్వచనం అందుకున్నారు.

భీమేశ్వరుని దర్శనంతో బోగం, మోక్షం: భీమేశ్వరస్వామి దర్శనంతో బోగం, మోక్షం లభిస్తాయని ఆయన అన్నారు. భీమేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం అనుగ్రహబాషణం చేశారు. అనుగ్రహం ఉంటేనే స్వామి వారిని దర్శించుకోగలమన్నారు. ద్రాక్షారామ వాసులు అదృష్టవంతులని తరచూ స్వామి వారిని దర్శించుకునే అవకాశం ఉంటుందన్నారు. దర్శనం అనంతరం పది నిమిషాల పాటు ధ్యానం చేయాలన్నారు.



ఆలయ సిబ్బంది సమక్షంలో బంగారు గొలుసు అందిస్తున్న బుజ్జి

భక్తుడి నిజాయితీ

ఐ.పోలవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో దొరికిన బంగారు గొలుసును సిబ్బందికి అప్పగించి ఒక భక్తుడు నిజాయితీ చాటుకున్నాడు. ఈ నెల 10వ తేదీ రాత్రి కాకినాడకు చెందిన అనురాధ వీరేశ్వరస్వామి కల్యాణం చేయించుకునేందుకు వచ్చి రూ.50 వేలు విలువైన బంగారు గొలుసు పోగొట్టుకుంది. పశువుల్లంకకు చెందిన సలాది బుజ్జికి అది దొరికింది. ఆయన దానిని దేవస్థానం సిబ్బందికి అప్పగించాడు. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ సమక్షంలో అనురాధకు అప్పగించారు. బుజ్జిని సహాయ కమిషనరు మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు.